# ఆగండి - ఆలోచించండి!

డి. కామేశ్వరి


దూరంగా ఎక్కడో రెండు గంటలు కొట్టింది.

తరువాత డ్రాయింగు రూములో వాల్ క్లాక్ టింగ్....టింగ్ అంటు రెండుసార్లు సంగీతంలా పాడింది. ఆ గంటలు గుండెల్లోనే కొట్టినట్టు ఝల్లుపడింది సునంద. కళ్లు మూసుకు నిద్ర నటిస్తున్న సునంద - నటిస్తున్న నిద్ర కళ్లమీదికి వరుగుతుందేమోనని కళ్లిప్పి చూస్తుంది మధ్య మధ్య.

రెండు గంటలు.... అప్పుడే రెండు గంటలు - ఇంకొక్కగంట.... ఒక్కగంట మాత్రం వుంది భవిష్యత్తు దారి నిర్ణయించుకుంది. సునంద గుండెలు గబ గబా కొట్టుకున్నాయి. వళ్లంతా చిరుచెమట పట్టింది. అంతవరకు వున్న నిబ్బరం క్షణాలు గడుస్తున్నకొద్దీ జారిపోసాగింది. ధైర్యం కూడదీసుకుంటూ, ఒక్కగంట.... మూడున్నరకి ట్రైను. మూడుగంటలకి వినయ్ టాక్సీతో వస్తాడు....టాక్సీ ఎక్కుతుంది.... రైలెక్కుతుంది.... ఆ తరువాత భవిష్యత్తంతా అందంగా, ఆనందంగా, తీయనిపాటలా సాగిపోతుంది.... "ఈ రాత్రి గడిస్తే - ఈ పంజరపు బ్రతుకు యిక నీకు తీరులే" పాట గుర్తొచ్చింది - నిజంగా పంజరంలో చిలకలా.... పుట్టిపంజరం కాద బంగారు పంజరంలో చిలకలా పడేసి, తిండి తింటూ.... పలకమన్న చిలకపలుకులు పలుకుతూ.... అదే బతుకన్నట్టుగా బతికింది. పెళ్లాడడం, పిల్లల్ని కనడం, వండుకు తినడం, పిల్లల్ని చూసి మురిసిపోవడం, మొగుడు చీరలుకొంటే సంబరపడడం, సినిమాకి తీసికెళ్లినా పొంగిపోడం, దగ్గరకి తీసుకున్న రోజు కరిగిపోయి.... అదే బతుకన్నట్టు పదహైదేళ్లు గానుగెద్దులా ఏ వైవిధ్యమూ, ఏ థ్రిల్, ఏ ఎక్సైట్‌మెంటు లేకుండా ఒకే గాడిలో ఒకే వరవడిలో తిరిగే గానుగెద్దు జీవితం గడిపింది — వినయ్‌తో పరిచయం అయినాకగాని జీవితం అంటే యిదే గాదన్నది మొదటిసారి అర్థమైంది. అర్థమయ్యాక తనేం నష్టపోయిందో.... మధురంగా గడపాల్సిన జీవితం అంతా ఎంత నిర్లిప్తంగా గడిచిపోయిందో తెలిసాక, ఆ [illegible] పోయిన క్షణాలు పొందేఅవకాశం వినయ్ కల్పిస్తుంటే కాదనగలిగే మనోనిబ్బరం కోల్పోయింది - బెటర్ లేట్ దెన్ నెవ్వర్, యింక సగం జీవితం ముందుంది.... యీ గానుగెద్దు బతుకు పందేళ్లు బతికేకంటె ఒక్క ఏడాది మనకు మనమై నవ్యవనాలు తిరిగి, ఆనందపుటంచులు చేరుదాం, రా నేనున్నాను నీకుఅని చేయిచాచి పిలుస్తుంటే ఆ చేయి అందుకుని తనని తాను అర్పించుకుంది. అతనిలో ఏదో వుంది, ఏదో మెస్మరిజం చేశాడు తనని - ఆ ఆకర్షణ నించి తప్పించుకోలేక పోయింది - అతను లేని క్షణం నరకమైంది. అతని కోసం యిల్లువాకిలీ, భర్త, పిల్లలు, సమాజం అన్నిటిని వదలగలిగే నిబ్బరం యిచ్చాడు. లోకులు కాకులు నాలుగురోజులు చెప్పుకుని మరిచిపోతారు అని ధైర్యం చెప్పాడు - అందమైన భవిష్యత్తు కళ్ళముందు పరిచాడు. అతని నవ్వు, అతని మాటలు, అతని చూపులు, ప్రతిమాటలో పొగడ్త తనని వివశురాలిని చేశాయి. ఎవరినోట ఆ పొగడ్తలు వినాలని ఆశించి వినలేకపోయిందో అవి వినయ్‌నోట వింటుంటే అన్నింటిని వదులుకోగల నిబ్బరం వచ్చింది. అనురాగభరితమైన చూపులకి మొహంవాచిన ఆమె అతని చూపులకు బానిస అయింది. తన గురించి ఏనాడు ఆలోచించని భర్తగురించి తనెందుకు ఆలోచించాలి - భార్య అంటే వంటకి, పిల్లలకి అనుకుంటూ ఏ స్పందనా తెలియని అతని కోసం తనెందుకు బాధపడాలి - పిల్లలు పెద్దవాళ్లయ్యారు. తల్లిలేకపోయినా గడుపుకోగలరు - పిల్లల ఆలోచన వచ్చేసరికి ఆమె తల్లిహృదయం మూలిగేది.... ఎంత సుఖకోసమయినా తల్లి పిల్లలని వదలదు అంటారు, మరి తనుతల్లి గాదా....వినయ్ కనుచాటు అయ్యాక ముసిరే ఆలోచనలు, అతని సమక్షంలో గుర్తుండేవి కావు.... ఎన్నెన్ని ఆలోచనలు, ఎంత ఆందోళన, ఎంత మనస్తాపం. అటు పిల్లలు, భర్త — యిటు వినయ్.... రంపపుకోత మధ్య నలిగింది కొన్నాళ్లు.... ఆఖరికి అన్నింటిని అధిగమించింది స్వార్థం........

డ్రాయింగు రూములో గడియారం అర గంట కొట్టింది. సునంద నెమ్మదిగా పక్కమీద నించి లేచి పిల్లల బెడ్ రూంలోకి వెళ్లింది. బెడ్‌లైటు వెలుగులో చీరమార్చుకుని, మంచంకింద ముందే సర్దిపుంచిన సూట్‌కేస్‌తీసి డ్రాయింగ్‌రూంలో పెట్టింది. హాండ్‌బ్యాగులో వీలయినంత డబ్బు పెట్టింది. చెప్పులు తొడుక్కుని చప్పుడు కాకుండా వచ్చి డ్రాయింగు రూములో సోఫాలో కూర్చుంది. ఉద్వేగంతో ఆమె శరీరం వణుకుతోంది. చిరుచెమటలు పట్టినాయి. రైలు రాత్రవడం ఎంత మంచిది- ఎవరికీ తెలియకుండా వెళ్లే వీలుకల్గింది.

బయట టాక్సీ ఆగిన చప్పుడు వెంటనే సంకేతంగా హారన్ మోగింది. సునంద నెమ్మదిగా చప్పుడు అవకుండా తలుపు తీసింది. వినయ ఆమెని చూసి టాక్సీ దిగివచ్చి చేతిలో సూట్‌కేసు అందుకుంటూ 'ఎవరూ మెలకువగా లేరుకదా' గుసగుసలాడాడు. సునంద నెమ్మదిగా తలుపులు లాగి బయట గడియ పెట్టివచ్చి టాక్సీ ఎక్కింది. టాక్సీ డ్రైవర్ విస్మయంగా



చూడడం ఆ మసక వెలుతురులో కూడా సునంద గుర్తించింది. "స్టేషన్‌కి పోనీ" వినయ్ టాక్సి ఎక్కి అన్నాడు - టాక్సి కదిలింది. టాక్సి కదిలాక సునంద గుండె అదురు కొస్త తగ్గింది. పాలిపోయిన ఆమె మొహం చూస్తూ 'భయంగావుందా డార్లింగ్' సునంద చేయిపట్టుకొని అన్నాడు వినయ్. 'ఊ....' అంది వణుకుతున్న గొంతుతో.

"ఐయామ్ విత్ యూ డియర్ ...అలా చూడకు, నీవింత పిరికిదానవా డోన్ట్ ఫియర్ డియర్" ధైర్యం చెప్తూ చెయ్యి నొక్కాడు

"వినయ్.... నేను చేస్తున్నది తప్పు కదూ,....యిలా రావడం. ఆమె గొంతు రుద్ధమయింది. "ష్ ..." డ్రైవర్ వున్నాడు అన్నట్టు కళ్లతో సంజ్ఞచేశాడు. నేనేం చెప్పను యింక నీవే దిక్కు నాకు అన్నట్టు అతని చేయి గట్టిగా పట్టుకుంది.

హఠాత్తుగా టాక్సి ఆగింది. "ఏయ్ డ్రైవర్ యిక్కడెందుకు ఆపావ్" టాక్సి ఆగినచోట పోలీసు స్టేషను వుండడం చూసి కలవరపడ్తూ అన్నాడు వినయ్.

"సారీ.... మా అన్న కానిస్టేబుల్, నైట్ డ్యూటీలో వున్నాడు. యింటి తాళాలు యిచ్చి వచ్చేస్తాను, ఒక్క నిమిషం సార్ అని గబగబ వెళ్లాడు. తేలిగ్గా వూపిరి పీల్చుకున్నాడు వినయ్ - లైటు వెలుగులో సునంద మొహం కళావిహీనంగా వుండడం చూసి "ఇంకొక్క రెండు నిమిషాలకు స్టేషనులో వుంటాం, మరో పావుగంటలో రైలుమోతకూ ........ యింక భయం ఎందుకు-

మాటలలో పోలీసుస్టేషనునించి ముందు టాక్సి డ్రైవర్ వెనకావల సబ్ఇన్స్పెక్టర్ రావడం ఇద్దరూ గమనించలేదు.

"ఎవరు మీరు, యింతరాత్రి ఎక్కడికి వెళ్తున్నారు?" సబిన్స్పెక్టర్ టాక్సిలోకి చూస్తూ గంభీరంగా అడిగాడు. ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. ఇన్స్పెక్టర్ని చూడగానే వినయ్ తడబడిపోయి జవాబు చెప్పడం మరిచిపోయాడు.

"మిమ్మల్నే.... ఎవరు మీరు, ఎక్కడ నించి వస్తున్నారు" తీక్షణంగా అడిగాడు.

"స్టేషనికి వెడుతున్నాం..." వినయ్ మాటలు కూడదీసుకుంటూ అన్నాడు. మరో క్షణం తర్వాత నిబ్బరం తెచ్చుకుని "వై ఆర్ యూ ఆస్కింగ్...." కొస్త ధాటిగా అన్నాడు. ఇనస్పెక్టర్ ఆ మాటకి జవాబివ్వనవసరం లేదన్నట్టు టాక్సిలో సునంద వంక అనుమానంగా చూస్తూ "యీమె మీ కేమవుతారు" అడిగాడు. సునంద మొహం ఒక్క క్షణంలో గుర్తుపట్టలేనంత నల్లబడింది. వినయ్ గొంతు తడారిపోయింది. ఇదెక్కడి పీడ! ఆదిలోనే హంసపాదు అన్నట్టు యీ గోల ఏమిటి అనుకుని చిక్కచచ్చిపోయి "మై వైఫ్" అన్నాడు గొంతు పెగుల్చుకుని.... "మీ యిల్లెక్కడ" మరో ప్రశ్న బాంబులా పడింది. వినయ్ కొస్త గాభరాపడి సునంద యింటి ఎడ్రసు చెప్పాడు- అప్పటికి కొస్త ధైర్యం పుంజుకుని, ఆఫ్టరాల్ ఓ ఇన్స్పెక్టర్‌కి తను యింతలా భయపడ్తున్నాడేమిటి, యింత పిరికివాడిలా మాట్లాడుతున్నాడేమిటి అనుకుని కొస్త ధాటీగా "ఇంతకీ యీ ప్రశ్నలన్నీ మీరెందుకు అడుగుతున్నారు- స్టేషనికెళ్లే వాళ్ళని మధ్యలో యిలా ఆపి ప్రశ్నించే హక్కు మీకెవరిచ్చారు.- ఐ వాంట్ ఏన్ ఎక్స్ప్లనేషన్-" అన్నాడు తీవ్రంగా.

ఇనస్పెక్టర్ నిర్లక్ష్యంగా "మిస్టర్ మీ పేరేమిటో తెలియదు, కాని ఈ టాక్సి డ్రైవర్ చెప్పిందాన్ని బట్టి మీ యిద్దరూ వేరు వేరు యిళ్ళనించి వచ్చినట్టు మీరు టాక్సి తీసుకుని ఆమె యింటికి వెళ్లినట్టు- అక్కడ ఆమె ఇంట్లోంచి దొంగతనంగా వచ్చినట్టు - టాక్సిలో మీ మాటలు కొన్ని విని యిద్దరు యింట్లోంచి రైలెక్కి వెళ్లిపోడానికి ప్లానువేసినట్లు అర్థమైందని చెప్పాడు అదె నిజమైతే ఒక గౌరవనీయ కుటుంబ స్త్రీని లేపుకు పోతున్నందుకు "బైగమీ" కింద మిమ్మల్ని అరెస్ట్ చేసే హక్కు నాకు వుంది-" కఠినంగా అన్నాడు. యినస్పెక్టర్ ఏంచేస్తావన్నట్టు చూశాడు వినయ్ మొహం ఎర్రబడింది. టాక్సి డ్రైవర్‌ని మింగేసేటట్టు చూశాడు- "యూ బాస్టర్డ్" అంటూ మీదకి వెళ్ళి చూడు నిన్నేంచేస్తానో" అని అరిచాడు. యినస్పెక్టర్ వినయ్‌ని వెనక్కి లాగి "ఏయ్ మిస్టర్ విల్ యూ కీప్‌క్వైట్ ముందు ఈమె నీ భార్య అని నిరూపించు. అప్పుడు తప్పకుండా నీకు క్షమాపణచెప్పి వదులుతాను. పద, యీమె యింటికి తీసి కెళ్ళి అక్కడ యింట్లోవాళ్ళచేత నీ భార్య అని చెప్పించు, పద, టాక్సి ఎక్కు...." తీవ్రంగా అన్నాడు.

సునంద పై ప్రాణాలు పైనేపోయాయి- యింటికెడితే.... యింకేమన్నా వుందా- అంతా తెలిసిపోతుంది- తాను చేసిన పని తెలిస్తే........ యింక భర్తకెలా మొహం చూపించడం, యింక ఆ యింట్లో ఎలా వుండడం.... అనాలోచితంగా, ఆవేశంతో వేసిన అడుగు మొదట్లోనే యిలా బెడిసి కొట్టింది. యిప్పుడీ యినస్పెక్టర్ ఏం గొడవ చేస్తాడో.... యిందులోంచి ఏలా బయటపడడం...." వినయ్. నన్నింట్లో దింపేయ్. నేను వెళ్ళిపోతాను వినయ్" ఏడుపు మినహాగా అంది గాభరాగా.

"సో, వుయ్ ఆర్ రైట్" మిస్టర్ యింకా దబాయించాలని చూడకు, ముందు యిద్దరూ దిగి లోపలికి రండి- ఉ....రండి గర్జించాడు యినస్పెక్టర్.

"ఇనస్పెక్టర్ ప్లీజ్ హియర్ మీ" బతిమాలే ధోరణిలో అన్నాడు వినయ్.

"చెప్పదలచింది లోపలికొచ్చి చెప్పండి- లోపలికి రాకపోతే వచ్చేట్టు చెయ్యాల్సి వుంటుంది. అంటూ లోపలికెళ్ళి తన సీటలో కూర్చున్నాడు. హెడ్ మాస్టర్ ముందు తప్పుచేసిన విద్యార్థుల్లా శిక్షకి ఎదురు చూస్తున్నట్టు తలలు దించుకొని నిల్చున్నారు. ఆఖరి ప్రయత్నంగా, చిన్న ఆశతో జేబులోంచి పర్సుతీసి ఐదొందల నోట్లు టేబిల్ మీద పెట్టి 'యిన్ స్పెక్టర్ ప్లీజ్-' ఏదో చెప్పబోయాడు.

"టేక్ ఆల్ దట్ మనీ ఫస్ట్- టేకిట్ బసే.... లంచం యిద్దామనుకుంటున్నావా. హౌ డేర్........ ఒకరి భార్యని లేపుకుపోడాకిని ప్రయత్నించడం ఒక నేరం. ఆఫీసరుకి లంచం యివ్వాలని ప్రయత్నించడం రెండింటికి కలిపి ఎన్నేళ్ళు శిక్ష పడ్తుందోతెలుసా" "తీక్షణంగా చూశాడు. వినయ్ తలదించు కున్నాడు. సునంద భయంతో వణికింది- ఎలాంటి పరిస్థితిలో యిరుక్కుంది తను.... యినస్పెక్టర్ యిప్పుడు తమ మీద కేసు పెడ్తాడా జైల్లో పెడ్తాడా కోర్టెక్కుతుందా కేసు.. యీ వార్త అన్ని పేపర్లలో వేస్తారేమో.. యింక తనెలాగతలఎత్తుకోడం....సునంద వళ్లు వశం తప్పినట్లయింది,— ఆప్రయత్నంగానే చేతులు జోడించి "యినస్పెక్టర్. మమ్మల్ని క్షమించి వదిలేయండి. తొందర పడ్డాను, ఆవేశంలో ఏం చేస్తున్నదీ తెలియకుండా చేశాను- యిప్పుడే

నా భర్తకు తెలిస్తే నా గతి ఏమవుతుందో ఆలోచించండి, యింటికెళ్లి పోతాను." చాలా దయనీయంగా భగవంతుని ముందు చేతులు జోడించి ప్రార్థించినట్టుంది. ఆ క్షణంలో తన హోదా, స్వాభిమానం అన్ని మరిచిపోయి క్షమించి వదులుతాడా లేదా అన్నట్టు ఆరాటంగా చూసింది.

"మేడమ్ మీరెవరో నాకు తెలీదు, చూస్తే చదువు సంస్కారం వున్న వారిలా వున్నారు- యిలాంటి పనికి ఎందుకు తలపడ్డారు. ఇంట్లోంచి వెళ్లి పోవడం వల్ల ఎదుర్కోబోయే యిబ్బందులు ఆలోచించారా. మీ కంతగా ఆయనతో పడక పోతే ధైర్యంగా విడాకులు తీసుకుని వెళ్లాలి, గాని ఇతన్నిలా నమ్మి నడిరాత్రి దొంగతనంగా యిల్లు వదలి వెళ్లడం ఎంత అనుచితమైన పనో తెలుసా, యితను మిమ్మల్ని రెన్నాళ్ల తరువాత మోసం చేసి వెళ్లిపోతే ఏం చేస్తారు. ఎన్ని కథలు విన్నాం యిలాంటివి........

వినయ్ మొహం ఎర్రబడింది- ఆవేశంగా "యినస్పెక్టర్- యూ ఆర్ యిన్సల్టింగ్ మీ.... యిది మా పర్సనల్ విషయం, యూ హేవ్ నో బిజినెస్ టూ యిన్టర్ ఫియర్....·" కోపంగా అన్నాడు.

మిస్టర్, మీ యిద్దరు భార్యాభర్తలు కారు- యిద్దరూ అర్ధరాత్రి అనుమానస్పదంగా తిరుగుతున్నారని బ్రోతల్ కేసు పెట్టి, అరెస్ట్‌చేసి. కేసు కోర్టు కెక్కిస్తే శిక్ష యెన్నేళ్లు పడ్తుందో తెలుసా. యిఫ్ యూ టాక్ యెనదర్ వర్డ్ ఐ విల్ కీప్ యూ అండర్ అరెస్ట్-" వినయ్ మొఖం తెల్లగా వాలిపోయింది. ఆ దెబ్బతో మరి నోరెత్త లేకపోయాడు.

"మేడమ్, మీ వివరాలు చెప్పండి, మీ పేరు, మీ భర్త పేరు ఆయన ఉద్యోగం, మీ యెడ్రసు చెప్పండి" కాగితం కలంతీసి అన్నాడు.

"నో....నో.... ప్లీజ్ యిదంతా కాగితం మీద పెట్టకండి.... నేను యింటికెళ్లిపోతాను, దయచేసి నన్ను వదిలేయండి.... యీ సంగతి ఆయనకి తెలిస్తే నాకింక ఆత్మహత్య తప్ప ఏ గత్యంతరము వుండదు," సునంద గొంతురుద్ధమయింది.

ఇనస్పెక్టర్ సాలోచనగా సునందని "సరే పదండి, మిమ్మల్ని యింటి దగ్గిర వదులుతాను- మిస్టర్ ఒక అయినింటి స్త్రీ బతుకు బజారు పాలు చెయ్యలేక నిన్ను వదులుతున్నాను. నౌ, గెటౌట్ ఫ్రమ్ హియర్- మళ్లీ యింకెప్పుడన్నా యీమె జోలికి వెళ్లావని తెలిస్తే.... గెటౌట్.... తిరస్కారంగా అని.... టాక్సి డ్రైవర్ వంక తిరిగి "పద నీ టాక్సిలో యీమెని యెక్కడనించి తీసుకొచ్చావో అక్కడ దింపి వద్దాం. నీ సమయ స్ఫూర్తి వల్ల ఒక కాపురం నిలబడింది- మేడమ్ మీ రివాళ ఇతన్ని తిట్టుకుంటూవుండచ్చు. కాని మీ రివాళ ఇతని వల్ల రక్షింప బడ్డారన్నది యింకో రోజన్నా తెలుసుకుంటారు" అన్నాడు.

సునంద సిగ్గుతో తలెత్తలేక పోయింది.

టాక్సి యింటిముందు ఆగాక "యినస్పెక్టర్ మీకు థ్యాంక్స్.... నా పరువు కాపాడారు... థ్యాంక్స్" సునంద సిగ్గుతో చితికి పోతూ అంది.

"ఇటాల్ రైట్ మేడమ్.... నా డ్యూటి నేను చేశాను. నేనూ భార్యా పిల్లలు గలవాడిని- నా భార్యే యిలా చేస్తే అని ఆలోచించి. మీ భర్త పరువు ఆలోచించి మీ కన్యాయం జరగకూడదని కాస్త కఠినంగా ప్రవర్తించాను. సారి ఫర్ ది ట్రబుల్, గుడ్ నైట్...." అని టాక్సి యెక్కి వెళ్లిపోయాడు.

సునంద చప్పుడు కాకుండా తలుపు తెరిచి లోపలికి వెళ్లింది. సూట్‌కేసు చప్పుడు కాకుండా యథా స్థానంలో పెట్టి బెడ్ రూమ్‌లోకి వచ్చింది. అలికిడికి మెలకువ వచ్చిన మూర్తి "ఏం చేస్తున్నావు" అన్నాడు నిద్ర మత్తులో.... "ఏం లేదు, బాత్ రూముకి వెళ్లాను" సునంద మంచం మీద వాలి నిట్టూర్చింది.

o o o

ఉదయం పదిన్నరికి కాలింగ్‌బెల్ విని సునంద తలుపు తీసింది- ఎదుట నిలబడ్డ వ్యక్తిని చూసి గుర్తుతెచ్చుకోడానికి ప్రయత్నిస్తు "ఎవరు....మీరెవరు?"

అతను చిరునవ్వు నవ్వి "అప్పుడే మరిచిపోయారు.... నిన్నరాత్రి టాక్సి డ్రైవరని ...." అన్నాడు. సునంద మొహం ఒక్కసారి కఠినమైంది. ఏం కావాలి యింక ఏం మిగిలిందని వచ్చావు. బ్లాక్‌మెయిల్ చేయాలని వచ్చావా ఎవరు లేకుండచూసి-" ఆవేశంగా అంది, అతన్నిచూసి మనసులో బెదిరింది.... ఏం అంటాడు. ఎందుకొచ్చాడు, బ్లాక్ మెయిలింగ్ మొదలుపెడితే తనేం చెయ్యగలదు.' ఒక్కక్షణంలో చుట్టుముట్టిన ఆలోచనలవి. "మేడమ్, ఒక్క పది నిమిషాలు మీతో మాట్లాడాలని వచ్చాను. బ్లాక్‌మెయిల్‌చేసే ఉద్దేశంవుంటే పోలీసు స్టేషను కెందుకు తీసికెళ్తాను. నాతోబుట్టువు లాంటివారు, మీరు అధోగతిలో పడకూడదని, మా అక్కలాగా మీజీవితం నాశనం అవకూడదని అలాచేశాను. నిన్నటి నా ప్రవర్తనకి క్షమాపణ కోరాలనివచ్చాను.

"మీ అక్క.... మీ అక్కకేమయింది. ఏం చేసింది" అప్రయత్నంగానే అడిగింది సునంద.

"హు.. ఏం అవుతుంది .... అది చెప్పాలనే వచ్చాను. కెనయ్ సిట్‌డౌన్" మర్యాదగా అడిగాడు. నిన్నటి టాక్సి డ్రైవర్ డ్రస్సులో లేకుండ, మంచి ప్యాంటు, టక్‌చేసిన షర్టుతో నీటుగా. యింగ్లీషు మాట్లాడుతున్న అతన్నే ఆశ్చర్యంగా చూస్తూ" కూర్చోండి' అంటూ సోఫాచూపించి తను కూర్చుంది. ఆమె ఆశ్చర్యం గుర్తించినట్టు నవ్వి."ఆశ్చర్య పడకండి. నేను మంచి కుటుంబంనించే వచ్చాను. బి.కాం. చదివాను. మానాన్న హెడ్‌మాస్టర్‌గాచేసి రిటైరయ్యారు. రెండేళ్లయినా ఉద్యోగం దొరక్కపోతే బ్యాంకు లోను తీసుక్కొని టాక్సికొని నడుపుతున్నాను ఏ ఉద్యోగమోచేసి సంపాదించేదానికన్నా ఎక్కువే సంపాదిస్తున్నాను." అన్నాడు. అతను తను అనుకున్నట్టు మామూలు టాక్సీడ్రైవర్‌కాదని విన్నాక అంత దురుసుగా మాట్లాడినందుకు నొచ్చుకుంది సునంద. "మేడమ్.... నిన్న అలా ప్రయత్నాన్ని అడ్డినందుకు మీకు చాలాకోపం వచ్చివుంటుంది. అందుకు క్షమాపణ కోరాలని, ముందుచూపుతో యెందుకలా చేశానో చెప్పాలని వచ్చాను. మా అక్కలాగ యింకో స్త్రీబతుకు పాడవకూడదన్న ఆరాటంతో మిమ్మల్ని ఆపాను. నేచెప్పేది వింటే ఆఖర్న మీరు తప్పక థాంక్స్ చెప్తారు."

సునంద సిగ్గుతో తలదించుకుంది,"మీ అక్కకు ఏమయింది చెప్పండి "ఆరాటంగా

"మా అక్క మీలాగే భర్త ద్వారా దొరకని సుఖాలు, అనుభూతులు ప్రేమించినవాడి దగ్గర అనుభవించాలని గుడ్డిగా అతన్ని నమ్మి వెళ్ళింది. భర్త నిర్లక్ష్యం, నిర్లిప్తత ఆమెని అదోరకం విరక్తిలోపడేసిన సమయంలో రమేష్‌రాక ఆమెకి జీవితంలో వసంతం వచ్చినట్టు అనుభూతిచెందింది. ఒక్కసారి అనుభవంలోకి వచ్చిన అతని ప్రేమలో తలమునకలయి, అతనులేని జీవితం ఊహించలేక, అతనిమాట కాదనలేని బలహీనతకిలోబడి, అతనికోసం ఇల్లు వాకిలి, భర్త పిల్లలు అందరిని వదులుకుని వెళ్ళింది.... ఏవస్తువన్నా మనకి అందనపుడే దానిమీద మోజు ప్రలోభం కల్గుతుంది. అందకుండా వూరిస్తున్నంతసేపు దాని అందం మరింత రెట్టింపు అవుతుంది అందుకే స్వంతంచేసుకునేవరకు ఆరాటపడ్తాం.... అందమైన స్త్రీ చేతికందాక కొన్నాళ్లు అపురూపమవుతుంది. పాత పడ్డాక, అలవాటైపోయాక ఇంటరెస్టు క్రమంగాపోతుంది. ఎంత అందమూ స్వంతంకాగానే మామూలైపోతుంది. ఆ వెర్రిమోజు, వ్యామోహం తీరగానే ఏముందని ఇంత ఆరాటపడ్డాం అనిపిస్తుంది. ఎవరికీ తెలియకుండా, దొంగతనంగా, భయంగా దొరికే థ్రిల్లింగ్ అనుభవంలో తెపి చేతికి పూర్తిగా అంది, బట్టబయలు కాగానే ఏ థ్రిలూ కనపడక చప్పబడుతుంది.

అంతే అయింది మా అక్క విషయంలో. ఆమె అందం, ఆమెతో సహచర్యం ఆర్నెల్లకే మామూలు ఐపోయింది అతనికి. ఏడాది గడిచేసరికి పిల్చిన చెరకు అయింది అక్క సంగతి. ఆ రాస్కెల్ అక్కని ఇల్లు వదలిరమ్మన్నాడు కాని వాడు మాత్రం భార్యాపిల్లలని వదలలేదు. ఇంకోవూరు ట్రాన్స్‌ఫరయింది. పిల్లల చదువులు పాడవుతాయి అని భార్యకీ చెప్పి ఆ వూరు అక్కతో వెళ్లాడు. వెళ్ళిన కొత్తలో మోజుకొద్దీ ఓ నెలరోజులు అనుక్షణం అక్కతోనే గడిపాడు. అనుభవం పాతపడుతున్నకొద్దీ ఆఫీసుపనిమీద అంటూ ముందులో నెలకోసారి, తరువాత వారానికోసారి యింటికెళ్ళి భార్యతో గడిపివస్తుండేవాడు, ఆమె పాపం నిజంగా ఆఫీసుపని అనుకుంది. ఒకసారి అతను నిజంగా ఆఫీసుపనమీద వెళ్ళినపుడు అఫీసుకి అతనికి వచ్చిన ఉత్తరం బంట్రోతు యింటికి తీసుకొచ్చి యిచ్చాడు. అది అతని భార్య రాసింది. "యీ ఆదివారం వచ్చేటపుడు మరో నాలుగు రోజులు శలవుపెట్టి రండి. మా చెల్లెలు పెళ్ళి నిశ్చయమైంది వెళ్లాలి. మీరు లేకుండా పిల్లలని కంట్రోలు చెయ్యడం చాలాకష్టంగా వుంది. పిల్లల పరీక్షలు ఎప్పుడవుతాయా, ఆవూరు ఎప్పుడు వస్తామా అని రోజులు లెక్క పెట్టుకుంటున్నాను." అని రాసిన ఉత్తరం చదివేసరికి మా అక్కకి సంగతి అర్థమై, అతను తనని ఎలా మోసం చేశాడో తెలిశాక ఆవేశం. ఉక్రోషం, దుఃఖం వచ్చాయి. అతను రాగానే నిలవేసింది. ఒక్క క్షణం భయపడ్డా, తరువాత నిర్లక్ష్యంగా 'అవును వెళ్తున్నాను. ఏం కట్టుకున్న భార్యని పిల్లలని చూడడం నేరమా, నీకోసంపాపం దాన్నెందుకు వదలాలి. దాని తప్పేం వుంది.... నీకోసం వాళ్ళని వదిలి నీదగ్గిరుంటున్నాను నీకింక ఏం కావాలి?" అని ఎదురు తిరిగాడు.

నాకు భర్తా పిల్లలులేరా, నీ కోసం




వాళ్లని శాశ్వతంగా వదల.కడా, నీ కోసం మళ్ళి పిల్లలని కళ్లచూడలేదు. నీకు మాత్రం యిటనేను, అటువాళ్లు కావాలి. ఇద్దరితో ఎంజాయ్ చేస్తావు. నన్ను నమ్మి వచ్చినందుకు శాస్తి అయింది అంటు తను ఏడ్చింది - తిట్టింది. "నీకిష్టం లేకుండా తీసుకొచ్చానా, నీమొగుడు వచ్చుకుంటే నీవు అచటికివెళ్లివస్తూండుఅం హేళనగా మాట్లాడును- అని ఏడ్చింది. అంతకంటె ఏం చెయ్యగలదు - ఆ తరువాత నెల రోజులకే యిద్దరిమధ్య పూర్తిగా చెడింది. యిద్దరిమధ్య ఘర్షణలు ఎక్కువయ్యాక ఓరోజు అతను చెప్పకుండా వెళ్ళిపోయి మరి రాలేదు- అతను చేసిన మోసం తెలిసాక తను నిస్సహాయంగా. ఏం చెయ్యాలో తోచని స్థితిలో పడింది. ముందుకు వెళ్లే దారిలేదు- వెనక దారి మూసుకుంది. యెలా బతకాలి, ఎందుకు బతకాలో, యెవరికోసం బతకాలో తెలియని స్థితిలో.... ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది– ఈలోగా అదృష్ట వశాత్తు యీ సంగతి తెలిసి మాబావ అక్కడికి దగ్గరకివచ్చి యింటికి రమ్మని పిలిచాడు. నా భార్యగా కాక నీ పిల్లలకి తల్లిగా రా, పిల్లలకి తల్లి అవసరం ఎప్పుడూ వుంటుంది అని పిలిచాడు. అతని ఔదార్యానికి, హృదయ వైశాల్యాన్ని చూసి ఆమె సిగ్గుతో పశ్చాత్తాపంతో చితికిపోయి చావలేక జీవచ్ఛవంలా అతనివెంట వెళ్లింది. భర్త ఔదార్యంతో క్షమించినా లోకం, పిల్లలు ఆమెని క్షమించలేరు. కన్న పిల్లలు తల్లికి శత్రువులయ్యారు - తల్లిని పురుగుకన్న హీనంగా చూశారు- ఆమెతో మాట్లాడకుండా, మాట్లాడవలసివస్తే విసురుగా, పొగరుగా, నిర్లక్ష్యంగా జవాబిచ్చేవారు. భోజనంకూడా పెట్టమని అడిగేవారు కారు. టేబల్‌మీద పెడితే తినడం వెళ్ళడం ఆమెని చూసి గుసగుసలాడి నవ్వుకోడం, తమకేం కావల్సిన తండ్రిని అడిగేవారు. తండ్రి తల్లిపిల్లలని దగ్గర చేయ్యాలని యెంత తపత్రయపడినా వాళ్ల తమ కార్యానికి తమని వదిలి వెళ్ళిన తల్లి అవసరం మరి లేదన్నట్టు కఠకట్టినట్టు అడుగడుగునా ఆమెని అవమానించేవారు. పదహారేళ్ళ కూతురు మరీ తల్లిని చూపులతో, మాటలతో, నవ్వుతో చిత్రవధచేసి ఆమె చేసిన తప్పు చచ్చినా క్షమించనట్టుగా కవి కట్టినట్టు ప్రవర్తించేది. రోజులు, నెలలు, ఏళ్లు గడచినా పిల్లలు తల్లిని క్షమించలేదు. కూతురి పెళ్లిచేసి పంపిస్తే యింట్లో శాంతి నెల కుంటున్నదనే ఆశతో పద్దెనిమిదేళ్లకే కూతురిపెళ్లి ప్రయత్నాలు ఆరంభించాడు- కాని ఆ ఆశ అంత సుళువుగా నెరవేరలేదు. తల్లి సంగతి తెల్సిన ఏ మంచి కుటుంబం కూతుర్ని చేసుకోలేరు. తెలియని వాళ్లకి కూడా యిరుగు పొరుగు తెలియపరిచి పుణ్యం కట్టుకున్నారు. తల్లి వలన తన పెళ్లి కావడంలేదని కూతురు మరింత కక్ష పెంచుకుని, కన్నతల్లి అని కూడా చూడక నానామాటలు అంది. అంతటితో యెప్పటికన్నా పరిస్థితి మెరుగు పడ్తుందని ఆశించిన మాఅక్క హతాశురాలైంది. యింక ఆ అవమానం సహించే శక్తి లేకపోయింది. తను బతికుండి భర్తకి అవమానాలు, తనకి పిల్లలకి మధ్య నలిగే భర్తని చూసి భరించలేక ప్రాణాలు తీసుకుంది - అప్పటితో ఆమె సమస్య తీరింది....

మేడమ్ ఇది అంతా మీకు యెందుకు చెప్తానో అర్థమైందనుకుంటాను. మగవాడెంత స్త్రీలోలుడై యెంత మందితో తిరిగినా ఆమోజు తగ్గగానే భార్య దగ్గరకి చేరతాడు. వాళ్లెన్నితిరుగుళ్లు తిరిగినా, యెంతమంది హృదయాలలో చెలగాటం ఆడినా హృదయంలో ఓమూల భార్యకి స్థానం యిస్తాడు. అదిమన వివాహంలో పవిత్రత అనండి, మహిమ అనండి, అతని ప్రేమమాటలు నమ్మి ఆడది యెప్పుడూ మోసపోతూనే వుంటుంది. దరి చేర్చుతాడని దగ్గరకి చేరిన ఏ ఆడదాన్ని వడ్డు చేర్చడు మగవాడు - కట్టిపడేసేవివాహబంధం కన్న మమకారం లేనిచోట ఏ స్త్రీ పురుష బంధం యెన్నాళ్లో నిలువదు- భర్త యెంత నిర్లక్ష్యం చేసినా అతని నీడే నయం -- కష్టపడే స్త్రీకి సానుభూతి దొరుకుతుంది కాని, సుఖం దొరికే చోటుకి వెళ్లే స్త్రీని క్షమించరు యెవరూ- తప్పు దారిలో సుఖపడే వారిని సమాజం క్షమించదు - మనం యెంత పురోగమించినా యీ కట్టుబాట్లు దాటిన వాళ్ళని క్షమించదు లోకం- సంఘంతో మనకు పనిలేదనుకోడం వెర్రి సంఘంలో వుంటూ- అనుక్షణం కొరికి కొరికి చంపుకు తింటుంది లోకం- లోకం మాట అటుంచి యిల్లు దాటిన స్త్రీ యెప్పుడూ మోసగింపబడుతుంది! అప్పుడు ఆ స్త్రీగతి ఏమిటి- తన కాళ్ళమీద నిలబడగలిగే స్త్రీభిక్షకురాలు యెదురయినా భరించి జీవచ్ఛవంలా జీవించగలిగే ఉపాధి వుంటుంది- అదిలేని ఆడది వళ్లను అమ్ముకోవాలి, గోదారన్నా చూసుకోవాలి- ఇల్లు దాటిన ఆడదాని జీవితానికి ముగింపు యెప్పుడూ విషాదమే.

మేడమ్.... సంసారంలో కంటి రాళ్లలా గుచ్చుకునే సంఘటనలు యెన్నో వుంటాయి. అవి గుచ్చుకోకుండా జాగ్రత్తగా నడవడం నేర్చుకోవాలి గాని నాలుగు రాళ్లు గుచ్చుకుంటాయని పక్కకి అడుగేస్తే కాలికి బురద అంటుకుంటుంది. ఆ బురదలో దిగబడిన కాలు పైకి లాక్కొన్నా ఆబురద కాలితో మిమ్మల్ని యింట్లోకి రానీయరు - బురద కడుక్కోవడానికి నీళ్లిచ్చి కడుక్కున్నాక లోపలికి రానిచ్చే దయామయులు మా బావలాంటి వారు నూటికి కోటికి ఒకరుంటారు.

"అందరు మగవాళ్ళు అలాగే వుంటారా.... సునంద నెమ్మదిగా అంది.

"మీకు రాసిస్తాను - నూటికి ఒకడు కూడా వుండడని- మేడమ్ మీరింకా తెలియని తక్కువగా ఆలోచిస్తున్నారు. ఒక మగవాడిలా నేను చెప్తున్నాను. పెళ్లికాని మగవాడేమోనని పెళ్లయిన వాడికి భార్య మీదవున్న సానుభూతి తనని నమ్మివచ్చిన ఆడదానిమీద వుండదు అని నేనంటే కాదనగలిగే మగవారిని చూపించండి. మీ ఆడవాళ్లు యెన్ని సంఘటనలు చూస్తున్న, యెంత చదువుకొన్నా ప్రతిసారి నమ్మి మోసపోవడం మీ వారసత్వం గాబోలు. మీ ఆడవాళ్ళంతా వస్తే ఆలోచించి అడుగు వెయ్యడం నేర్చుకోండి. ఇంతకంటే యింకేం చెప్పమంటారు వుంటామరి, మీ టైము పాడుచేసానని అనుకోకండి.... అంటూ నవ్వుతూ బయటికి వెళ్లిపోయాడు.

చాలా సేపు సునంద ఆలోచిస్తూ కూర్చుండిపోయింది - తరువాత అతని మాటలు పూర్తిగా అర్థం అయ్యాక నిట్టూర్చింది రాళ్లు గుచ్చుకుంటాయని పక్కకి అడుగేస్తె బురదలో దిగబడ్తారని యెంత చక్కగా చెప్పాడు- యెంత నిజం వుంది ఆమాటల్లో - అనుకుంది.

ఆమెకి తెలియని చిన్న నిజం వుంది ఆమెకి తెలియదు. ఆ రమేష్ అన్నయ్య అతనేనని, చెల్లెలికథ అబద్ధం - అతను ప్రేమించి వదిలేసిన ఆమె కథ నిజం అన్నది తెలియదు. ★